క్లుప్తంగా

ఘనంగా పునః ప్రతిష్టా మహోత్సవం



వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని ఏనుగుపాలెం రోడ్డులో వేంచేసిన శ్రీ అంకాలమ్మ తల్లి దేవాలయ పునఃప్రతిష్ట మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్ణాహుతి, యంత్ర ప్రతిష్ఠ, విగ్రహప్రతిష్ఠ, హోమాలు, మంత్ర హోమాలు, ధ్వజ, శిఖర ప్రతిష్ఠలు, ప్రాణప్రతిష్ఠ, బలిప్రధానములు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావులు పాల్గొని అంకాలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ, దేవదాయ శాఖ ఆధ్వర్యంలో వారిని ఘనంగా సత్కరించారు. 20 వేల మందికి అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు.

రాజ్యాంగ పుస్తకాల పంపిణీ



చిలకలూరిపేటటౌన్: పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు క్రమం తప్పకుండా కాంపిటీటివ్ పుస్తకాలు చదవాలని అర్బన్ సీఐ జి.రాజేశ్వరరావు చెప్పారు. గురువారం పట్టణంలోని అంబేడ్కర్‌భవన్‌లో జ్ఞానేశ్వరి అర్బన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో గ్రూప్ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు రూ. 300 విలువైన రాజ్యాంగం పుస్తకాలు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన అర్బన్ సీఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రాజ్యాంగ పరిజ్ఞానం కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ సలహాదారు దాసరి చిట్టిబాబు, సభ్యులు గేరా యాకోబు, డాక్టర్ పీవీ సుబ్బారావు, చుక్కా విన్సెంట్‌పాల్, దార్ల బుజ్జిబాబు, ప్రసన్నకుమార్, గుంజి వీరాంజనేయులు, శివ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పాడి పరిశ్రమలను ప్రోత్సహించేందుకే...

పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పి.శ్రీనివాసమూర్తి

బొల్లాపల్లి: పాడిరైతులను ప్రోత్సహించేందుకు గ్రామీణ ప్రాంతాల్లో జగనన్న వెల్లువలో మహిళలకు బ్యాంకు రుణాలు అందజేయడం జరుగుతుందని పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పి.శ్రీనివాసమూర్తి అన్నారు. మండలంలోని అయ్యన్నపాలెం గ్రామ సచివాలయంలో మహిళా పాడిరైతులకు జగనన్న పాలవెల్లువలో భాగంగా గురువారం రుణమేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈపూరు వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ మాట్లాడుతూ ప్రైవేటు డెయిరీల కంటే జగనన్న పాల వెల్లువ సేకరణలో మంచి ధర అందజేస్తున్నట్లు తెలిపారు. అధిక పాల దిగుబడి వచ్చే విధంగా పాడి గేదెల కొనుగోలుకు బ్యాంకుల ద్వారా మహిళలకు రుణాలు అందజేస్తున్నామని, సద్వినియోగపరచుకోవాలని సూచించారు. పాడి పరిశ్రమను పరిరక్షించేందుకే ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందని పాలవెల్లువలో మహిళా పాడి రైతులు పాలసేకరణతో ఆర్థిక పురోగతి సాధించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పి. సాయిబాబు, గుమ్మనంపాడు పశువైద్యాధికారి సాల్మన్‌సింగ్, వెలుగు పథకం సీసీ జేసుదాసు, గోపాలమిత్ర భాస్కరరావు, గ్రామ పెద్దలు మంత్రునాయక్, మహిళా పాడిరైతులు తదితరులు పాల్గొన్నారు.

కొత్త పింఛన్లు మంజూరు

నాదెండ్ల: మండలంలోని పదహారు సచివాలయాల పరిధిలో నూతనంగా 168 వృద్ధాప్య, వితంతు, వికలాంగ పెన్షన్లు మంజూరైనట్లు అధికారులు తెలిపారు. గత ఆగస్టు మాసంలో 9193 మందికి గాను రూ.2,53,46,250లు పంపిణీ జరగ్గా, సెప్టెంబర్ మాసంలో 9361 మందికి గాను రూ.2,58,14,000లు శుక్రవారం 1వ తేదీ నుండి 5వ తేదీ వరకూ వలంటీర్లు సాయంతో పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. 168 కొత్త పెన్షన్లకు గాను రూ.4,67,750లు అదనంగా పంపిణీ చేయనున్నారు.

శావల్యాపురంలో...

శావల్యాపురం: వైఎస్సార్ సామాజిక పింఛన్లు మండలంలోని 11 గ్రామసచివాలయాల పరిధిలో 411 మంది దరఖాస్తులు చేసుకొనగా 151 మంది వేరిఫికేషన్‌లో ఉండగా 156 మంది లబ్ధిదారులు అర్హత పొందినట్లు ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మాట్లాడుతూ నూతనంగా మంజూరైన లబ్ధిదారులకు పాత పింఛన్‌దారులతో ఆయా గ్రామాల్లోని వలంటీర్లు నగదు అందజేస్తారన్నారు.డిసెంబరు నాటికి అర్హత కలిగిన ఉన్న వారందరికీ నూతన పింఛన్లు ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు.

జగనన్న హయాంలోనే రాష్ట్రాభివృద్ధి

- వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- ఇనిమెళ్ల, బొమ్మరాజుపల్లి గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు
- హాజరైన ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావులు



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, వేదికపై ఎంపీ, మాజీ ఎమ్మెల్యే తదితరులు

ఈపూరు: వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అభివృద్ధి అంటే ఏమిటో ప్రజలకు తెలిసిందని వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. మండలంలోని ఇనిమెళ్ల, బొమ్మరాజుపల్లి, ఈపూరు గ్రామాల్లో పలు ప్రభుత్వ కార్యాలయాల ప్రారంభోత్సవాలకు హాజరై గురువారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఇనిమెళ్ల గ్రామంలో సచివాలయం, వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజీ హెల్త్ క్లీనిక్, కమ్యూనిటీ భవనాన్ని ప్రారంభించారు. ఇనిమెళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులతో కాస్సేపు ముచ్చటించారు. ఎలా చదువుతున్నారు, మీకు ఏమైనా సమస్యలున్నాయా, అమ్మఒడి నగదు అందరికీ అందుతున్నాయా అనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే బొమ్మరాజుపల్లిలో సచివాలయం, వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం, విలేజీ హెల్త్ క్లీనిక్‌లను ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావులతో కలిసి ప్రారంభించారు. అనంతరం మండల కేంద్రమైన ఈపూరులో రూ.80 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన మండల పరిషత్ భవనాన్ని ఎంపీపీ ఈదర రాధికతో కలిసి ప్రారంభించారు.



ఈపూరులో మండల పరిషత్ కార్యాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడు తూ గత ప్రభుత్వంలో శిలాఫలకాలు తప్ప భవన నిర్మాణాలు ఎక్కడా జరగలేదని, పేరుకు మాత్రం ప్రతిచోట కోట్ల రూపాయల శిలాఫలకాలు మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పేరుపై వేశారని, ఒక్కచోట కూడా భవన నిర్మాణం జరగక పోవడం గత ప్రభుత్వంలో ఏమేరకు అభివృద్ధి జరిగిందో అర్థమవుతుందన్నారు. సొంత ఊరికి కూడా రోడ్డు వేయించుకోలేని జీవీ ఆంజనేయులు తాను అధికారంలోకి వస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతి పంచాయతీలో రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాలు, విలేజ్ హెల్త్ క్లీనిక్‌లు నిర్మించి అభివృద్ధి అంటే ఏమిటో చూపించామన్నారు.

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో నాడు–నేడు నిధులతో ప్రతి పాఠశాలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దామని అన్నారు. నేడు ఈపూరు మండల పరిషత్ నూతన భవన నిర్మాణంతో మండల ప్రజల కల నెరవేరిందన్నారు. గత ప్రభుత్వంలో శిథిలావస్థకు చేరిన భవనాలను ఈ ప్రభుత్వంలో వాటిని కూల్చివేసి నూతన హంగులతో ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. మాది మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని ఆయన అన్నారు.

అభివృద్ధి ప్రదాత జగనన్న : ఎంపీ

ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ అభివృద్ధి ప్రదాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, ఆయన పాలనలో ప్రజలందరూ సుభిక్షంగా ఉన్నారన్నారు. నేడు పేద ప్రజల కోసం అమ్మఒడి, రైతు భరోసా, కాపునేస్తం వంటి అనేక పథకాలను ప్రవేశపెట్టి ప్రతి ఇంటికీ ఆసరాగా నిలుస్తున్న జగనన్నను మరలా అధికారంలోకి తీసుకురావాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. రాష్ట్రంలో నిధుల కొరత లేకుండా ఎక్కడ ఏ పని జరగాలన్నా వెంటనే నిధులు మంజూరవుతున్నాయని, త్వరలో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి చేతుల మీదుగా వరికపూడిశెల ప్రాజెక్టు పనులు ప్రారంభిస్తామని, దీని ద్వారా కొన్ని మండలాల్లో సమృద్ధిగా పంటలు పండుతాయన్నారు. ఇనిమెళ్లలో కమ్యూనిటీ భవనం అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు మాట్లాడుతూ గతంలో ఎప్పుడూ చూడని అభివృద్ధి ఇప్పుడు చూస్తున్నామని, అలాగే రాబోయే రోజుల్లో కూడా అనేక అభివృద్ధి కార్యక్రమాలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపడుతుందన్నారు.

ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ ఈదర రాధిక, జెడ్పీటీసీ చౌడయ్య, యార్డు చైర్మన్ చుండూరి వెంకటేశ్వర్లు, మండల పార్టీ అధ్యక్షులు కోపెల దేవరాజ్, వైఎస్సార్ సీపీ నాయకులు శాకమూరి బుచ్చయ్య, గోనుగుంట్ల వెంకటహనుమయ్య, బొల్లా బుజ్జి, కొండవర్జు నాగేశ్వరరావు, కాకనబోయిన శ్రీనివాసరావు, ఇనిమెళ్ల సర్పంచ్ తాడిపర్తి మార్తమ్మ, బొమ్మరాజుపల్లి సర్పంచ్ పోర్ల లక్ష్మీ నవ్య, ఈపూరు సర్పంచ్ పల్లమీసాల చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి



నాదెండ్ల: ఈ క్రాప్ నమోదయితేనే ఉచిత పంటల బీమా పథకం వర్తిస్తుందని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ ఎం.శివకుమారి చెప్పారు. మండలంలోని కనపర్రు, సాతులూరు గ్రామాల్లో జరుగుతున్న పంట నమోదు కార్యక్రమాన్ని నరసరావుపేట ఏడీఏ మస్తానమ్మతో కలిసి గురువారం ఆమె పరిశీలించారు. పత్తి, మిర్చి, కంది, సోయాబీన్స్, పెసర రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా పత్తిలో రసం పీల్చే పురుగు ఉధృతి ఉందన్నారు. దీని నివారణకు సరైన సస్యరక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం మిరప పైరు నాట్ల దశలో ఉన్నందున తప్పనిసరిగా పంట నమోదు చేయించాలన్నారు. వర్షాభావ పరిస్థితుల ఇలాగే కొనసాగితే ఉచిత పంట బీమా వర్తిస్తుందన్నారు. పంట నమోదును ఈ ఏడాది జియో కోఆర్డినేషన్ ఆధారితంగా పంట నమోదు జరుగుతుందన్నారు. దీని వలన ఖచ్చితమైన పంటల నమోదు జరుగుతుందని, రైతులకు ఎన్నో ఉపయోగాలుంటాయన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి హరిప్రసాద్, సహాయకులు జి రామాంజమ్మ, రామారావు పాల్గొన్నారు.

పేటలో వాడీవేడిగా కౌన్సిల్ సమావేశం

- వ్యక్తిగత దూషణలకు దిగిన టీడీపీ కౌన్సిలర్
- దీటుగా సమాధానం చెప్పిన వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు



టీడీపీ కౌన్సిలర్ల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వైస్ చైర్మన్ వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు



చైర్మన్‌కు వేలు చూపుతూ మాట్లాడుతున్న టీడీపీ కౌన్సిలర్ గంగా శ్రీనివాసరావు

చిలకలూరిపేట: ప్రతిపక్ష టీడీపీ కౌన్సిలర్ల ఆరోపణలు, అధికార పక్ష సభ్యుల ధీటైన సమాధానాలు... టీడీపీ సభ్యుల వ్యక్తిగత దూషణల మధ్య మున్సిపల్ కౌన్సిల్ సమావేశం వాడీ–వేడిగా కొనసాగింది. స్థానిక మైలవరపు గుండయ్య కౌన్సిల్ హాలులో కౌన్సిల్ సమావేశం గురువారం జరిగింది. సమావేశానికి మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని అధ్యక్షత వహించారు. సమావేశం ప్రారంభమై ఎజెండా చదువుతుండగా మధ్యలో టీడీపీ కౌన్సిలర్ కొత్త కుమారి మాట్లాడుతూ ఎజెండాలోని ఒక్కో అంశంపై చర్చ జరగాలని చెప్పారు. దీనికి వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు వడితే కోట్యానాయక్, పిల్లి సాగర్‌బాబు తదితరులు ఎజెండా పూర్తిగా చదివాక మాత్రమే అంశాలపై చర్చ నిర్వహించుకోవచ్చని, ఎజెండా మధ్యలో చర్చ ఏమిటంటూ సమాధానం చెప్పారు.

దీంతో టీడీపీకి చెందిన గంగా శ్రీనివాసరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ దుర్భాషలకు, దూషణలకు దిగారు. సమాధానం చెప్పిన వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లను ఉద్దేశించి వాడు, వీడు అంటూ పరుష పదజాలం ఉపయోగించారు. దీనికి తోడు ఇతర టీడీపీ కౌన్సిలర్లతో కలసి చైర్మన్ సభావేదిక వద్దకు చేరుకొని వాగ్వాదానికి దిగి, వేదిక ముందు బైఠాయించారు. దీంతో ఆగ్రహించిన మున్సిపల్ వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు టీడీపీ సభ్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై మాట్లాడటం చేతకాక సమావేశాన్ని అడ్డుకోవడం, ఆటంకపరచటమే ఉద్దేశంగా గంగా శ్రీనివాసరావు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. సభా మర్యాద తెలుసుకొని వ్యవహరించాలని హితవు పలికారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. మున్సిపల్ చైర్మన్ రఫాని జోక్యం చేసుకొని సర్దిచెప్పి ఎజెండా చదవడం తిరిగి ప్రారంభింపచేశారు.

ఆధారాలతో నిరూపించండి...

సమావేశం జరుగుతుండగా టీడీపీ కౌన్సిలర్ గంగా శ్రీనివాసరావు తిరిగి ఆరోపణలకు దిగారు. పండరీపురం మంచినీటి ట్యాంకర్ల సముదాయం వద్ద ఇనుప స్క్రాప్ విక్రయంలో రూ. 80 లక్షల అవినీతి జరిగిందని ఆరోపించారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు మాట్లాడుతూ నాలుగు పాత ఖండం వాహనాలను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మోటారు వెహికిల్ ఇన్స్‌పెక్టర్ అంచనాలు రూపొందించాక ఇచ్చిన అంచనాల కన్నా అధిక ధరకు స్క్రాప్ విక్రయించటం జరిగిందని, ఎంవీఐ స్క్రాప్ విలువ రూ. 2.10 లక్షలు నిర్ణయించగా, దాని కన్నా ఎక్కువకు రూ. 2.24 లక్షలకు నిబంధనల ప్రకారం విక్రయించామని సమాధానం చెప్పారు. తిరిగి శ్రీనివాసరావు రెవెన్యూ విభాగంలో పని చేసే అవుట్ సోర్సింగ్ ఉద్యోగిని రూ. 60 లక్షలు కాజేసిందని ఆరోపించారు. దీనికి కమిషనర్ మాట్లాడుతూ మున్సిపల్ షాపుల అద్దెలకు సంబంధించి నెలకు రూ. 13 లక్షలు రావాల్సి ఉండగా, జులై మాసానికి సంబంధించి రూ. 11 లక్షలు మాత్రమే చూపడంతో సంబంధిత అవుట్ సోర్సింగ్ ఉద్యోగి గంగాభవాని పై విచారణ నిర్వహించి ఆమె వద్ద నుంచి తగ్గిన డబ్బులు రికవరీ చేసి ఆమెను విధుల నుంచి తప్పించినట్లు చెప్పారు.

పదేపదే టీడీపీ సభ్యులు ఆరోపణలకు దిగుతుండటంతో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని జోక్యం చేసుకొని అసత్య ఆరోపణలతో సమయాన్ని వృధా చేయవద్దని హెచ్చరించారు. ప్రతిపక్ష సభ్యులు విజ్ఞత మరచి ఆధారాలు లేని ఆరోపణలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. ఎలాంటి ఆరోపణలకైనా సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నామని సవాలు విసిరారు. అసత్య ఆరోపణలకు పాల్పడితే సహించేది లేదని హితవు పలికి సమావేశం ముగించారు. సమావేశంలో పలువురు కౌన్సిలర్లు మాట్లాడారు.

ప్రతి విద్యార్థి సామర్థ్యం మెరుగవ్వాలి

- నరసరావుపేట డీవైఈవో వేణుగోపాలరావు
- తిమ్మాపురం జెడ్పీ హైస్కూల్ సందర్శన
- విద్యార్థుల సామర్థ్యాల పరిశీలన
- ఉపాధ్యాయులతో విద్య మెరుగుపై సమీక్ష



తిమ్మాపురంలో విద్యార్థుల రాతపుస్తకాలను పరిశీలిస్తున్న డీవైఈవో వేణుగోపాలరావు

యడ్లపాడు: విద్యార్థుల విద్య సామర్థ్యాలను పెంచే దిశగా ఉపాధ్యాయులు డైరీలు, పాఠ్యాంశాల ప్రణాళికలను ఎప్పటికప్పుడు రూపొందించుకోవాలని నరసరావుపేట ఉపవిద్యాశాఖ అధికారి వేణుగోపాలరావు చెప్పారు. యడ్లపాడు మండలం తిమ్మాపురం జిల్లాపరిషత్ హైస్కూల్‌ను గురువారం ఆయన సందర్శించారు. పాఠశాలలోని తొమ్మిదో తరగతిలోకి వెళ్లి విద్యార్థుల విద్యా సామర్థాలను, నోట్‌బుక్స్‌ను పరిశీలించారు. పాఠ్యాంశాలు, జనరల్ నాలెడ్జ్ విషయాలపై ప్రశ్నలు అడిగారు. పాఠ్యాంశాల బోధన విధానం, వాటిపై విద్యార్థికి అవగతమయ్యే విషయాలపై ఆరా తీశారు. ప్రతి విద్యార్థి క్రమం తప్పకుండా ట్యాబ్‌లను అనుసరించి విద్యా పరమైన విషయాల పరిశీలనలో ముందుండాలని తెలిపారు. ఇంగ్లిష్ భాషా సామర్థ్యాలను పెంపొందించుకోవాలని, విద్యార్థులకు విద్యా పరమైన పలు సూచనలు చేశారు. పాఠశాల ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. ఉపాధ్యాయులు విధిగా డైరీలు రాయాలని, అలాగే పాఠ్యాంశాల ప్రణాళికలను రూపొందించుకోవాలన్నారు. విద్యలో వెనుకంజలో ఉన్న విద్యార్థుల్ని గుర్తించి వారికి ప్రత్యేక తరగతుల నిర్వహణ చేపట్టాలని ఆదేశించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. జగనన్న గోరుముద్ద మెనూ ప్రకారంగా అమలు అవుతుందో లేదో విద్యార్థుల నుంచి తెలుసుకున్నారు.

రాగిజావను రుచిచూసి నాణ్యత విషయాలపై వారి అభిప్రాయాలను సేకరించారు. కార్యక్రమంలో ఐఎఫ్‌పీ ప్యానెల్, బైజూస్ ట్యాబ్ ఇన్‌స్ట్రక్టర్ పూర్ణచంద్రరావు, పాఠశాల హెచ్‌ఎం ఎ.వెంకటాద్రి నాయుడు, ఉపాధ్యాయులు ఉన్నారు.

సాహితీమూర్తులకు సన్మానం

నాదెండ్ల: మాతృభాషకు ఎనలేని సేవ చేస్తున్న సాహితీమూర్తులను సత్కరించుకోవటం అందరి బాధ్యత అని మఠాధిపతి కటారు దాసునాయన చెప్పారు. గణపవరం జాతీయ రహదారి పక్కనే సినిమా హాల్ సెంటర్‌లో ఉన్న అచల దాసునాయన మఠంలో గురువారం తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. సాహితీ విమర్శకులు డాక్టర్ బీవీ సుబ్బారావు, చెన్నైకి చెందిన డాక్టర్ బెల్లంకొండ నాగేశ్వరరావు, బాలసాహితీవేత్త దార్ల బుజ్జిబాబులను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మఠంలో జరుగుతున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటూ తెలుగు భాషకు విశేష సేవలందించిన సాహితీవేత్తలను సత్కరించటం ఆనందకరమన్నారు. కార్యక్రమంలో సభ్యులు నూతలపాటి హనుమాయమ్మ, తోట దాసు, పాల్గొన్నారు.

దేవాలయ పునర్నిర్మాణానికి విరాళం

వినుకొండ(నూజెండ్ల): పట్టణ అభివృద్ధి సేవా సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానం పునర్నిర్మాణానికి మాజీ ఎంపీపీ ములకా రామతులసి రెడ్డి రూ.2 లక్షలు, మండవ రాఘవేంద్ర రూ.లక్ష, తాతా పాండురంగారావు రూ.2,11,116లు విరాళాన్ని కుటుంబసభ్యులతో కలిసి సంఘం సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపి అభినందించారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సలహాలు, సూచనలతో ఆలయ పనులు పూర్తి చేసేలా కృషి చేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం కొండ వద్ద జరుగుతున్న పనులను పరిశీలించారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షులు పెండేల వెంకట పుల్లారావు, ప్రెసిడెంట్ పులిపాటి రామారావు, సెక్రటరీ జాజుల మాల్యాద్రి, వైస్ ప్రెసిడెంట్ చందోలు మల్లికార్జున రావు, గంధం బాలిరెడ్డి, జాగర్లమూడి సుబ్బారావు, గజవల్లి పవన్, దండు చెన్నయ్య, కన్నెగండ్ల అనంత రామకోటేశ్వరరావు, గోవిందనాయక్, రెడ్డి నగేష్, తేలికపల్లి బాబు, తదితరులు పాల్గొన్నారు.



సంఘం సభ్యులకు విరాళం అందజేస్తున్నదాతలు

యువ కవులకు సాహితీ పురస్కారాలు



కథా రచయిత్రి సుజాతను సత్కరిస్తున్న దృశ్యం

నరసరావుపేట ఈస్ట్: ప్రకాష్ నగర్‌లోని సాహితీసంస్థ మై మూన్ మకాన్‌లో బుధవారం రాత్రి నాగరాజు గంధం స్మారక సాహితీ పురస్కారం–2023 ప్రధానోత్సవం ఘనంగా నిర్వహించారు. కథా రచయిత్రి వేల్పూరి సుజాత, కవి కట్టా సిద్ధార్థ, వర్ధమాన రచయిత గూండ్ల వెంకటనారాయణలకు పురస్కారాలను అందచేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి సంస్థ వ్యవస్థాపకుడు, నటుడు ఎస్‌ఎం బాషా అధ్యక్షత వహించగా, రచయిత, చరిత్రకారుడు షేక్.నజీర్ అహ్మద్, కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార్ అవార్డు గ్రహీత మెర్సీమార్గరేట్, రచయిత్రి వసుధ రాణి, సాహితీవేత్త గంధం యాజ్ఞవల్క్యశర్మ పాల్గొన్నారు.

అర్హత ఉన్న పాడి రైతులందరికీ రుణాలు



రుణధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న బ్రాంచ్ మేనేజరు విశ్వనాథ్

శావల్యాపురం: జగనన్న పాలవెల్లువ కార్యక్రమంలో భాగంగా అర్హత కల్గిన పాడిరైతులందరికి రుణాలు మంజూరు చేస్తున్నట్లు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు మేనేజరు ఇలింద్రపర్తి విశ్వనాథ్ అన్నారు. గురువారం స్థానిక బ్రాంచి కార్యాలయంలో మహిళా సభ్యులకు రుణాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఇప్పటి వరకు జగనన్న పాలవెల్లువ కార్యక్రమంలో భాగంగా రైతు ఆదాయం ఆధారంగా ఒక్కో పాడి రైతుకు రూ. లక్ష నుంచి 2 లక్షల వరకు పావలా వడ్డీపై 211 మంది పాడి రైతులకు రుణాలు మంజూరు చేశామనీ, రుణాలను సక్రమంగా చెల్లించిన రైతులకు రెన్యూవల్స్ చేస్తున్నామన్నారు. అలాగే 7వ విడత జగనన్న చేదోడు పథకంలో భాగంగా చిరువ్యాపారులు జీవనోపాదులు నిమిత్తం 250 మంది మహిళలకు రుణాలను ఇవ్వటానికి రంగం సిద్ధం చేశామన్నారు. అలాగే స్వయం సహాయక మహిళా సభ్యులకు 70 గ్రూపులకు ఇప్పటి వరకు రూ. 15 కోట్లు రుణాలను మంజూరు చేశామన్నారు. మహిళా సభ్యులు ఆర్థిక ప్రగతికి ప్రభుత్వ సహకారం సద్వినియోగం చేసుకుని జీవన ప్రమాణాలు పెంపొందించుకోవాలన్నారు. అనంతరం మహిళా సభ్యులకు రుణాధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ ప్రదీప్‌చంద్ర, నివ్య, హారణి, సిబ్బంది రామిరెడ్డి, యానిమేటరు యం. కోటేశ్వరమ్మ పాల్గొన్నారు.

ఘనంగా శ్రీవారి రథోత్సవం



వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని శ్రీనివాసనగర్‌లో వేంచేసి ఉన్న అలివేలు మంగ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి 37వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడవ రోజు గురువారం స్వామి వారికి పుణ్యాహం, అగ్ని ధ్యానం, నారాయణ అష్టాక్షరి, మంత్ర హోమం వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీవారి అపూర్వ రథోత్సవం పట్టణ పురవీధుల్లో నిర్వహించారు. స్వామివారి రథోత్సవంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని రథానికి బిందెలతో నీరుని వారుగా పోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు రెడ్డి బంగారయ్య, ప్రధానకార్యదర్శి అచ్యుత కృష్ణ సుబ్బారావు, కోశాధికారి కాళ్ల రామ కోటేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సామూహిక కుంకుమార్చన

నరసరావుపేట ఈస్ట్: సత్తైనపల్లిరోడ్డులోని అయ్యప్పస్వామి ఆలయంలో శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకొని గురువారం శ్రీమహాలక్ష్మీ అమ్మ వారికి సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కొత్తూరి గోపి, మల్లిక దంపతుల ఆధ్వర్యంలో 175మంది మహిళలు కుంకుమార్చనలో పాల్గొన్నారు. మహిళలకు పసుపు–కుంకుమ, చీర, పండ్లుతో పాటు గీత జ్ఞానామతం అనే పుస్తకాన్ని అందచేశారు. భక్తులకు స్వామివారి అన్నప్రసాద వితరణగావించారు. ఆలయ కమిటీ కార్యదర్శి చేబ్రోలు ఫణికుమార్, కోశాధికారి మైలవరపు ధనుంజయ్, వెంకట సూర్య నారాయణ, చేగు వెంకటేశ్వరరావు తదితరులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ఘనంగా రక్షాబంధన్ వేడుకలు



వినుకొండ(నూజెండ్ల): స్థానిక నరసరావుపేట రోడ్డులోని గీతమ్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో రక్షాబంధన్ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలురకు బాలికలు రాఖీలు కట్టి తమ సోదర భావాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో గీతమ్స్ విద్యాసంస్థల కరస్పాండెంట్ మాలపాటి కోటిరెడ్డి హాజరై రక్షాబంధన్ గొప్పతనాన్ని వివరించారు. తోబుట్టువులకు జీవితాంతం అండగా ఉంటామని భరోసా ఇచ్చే పండుగ రక్షాబంధన్ అని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శోభా విక్టోరియా, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.